
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



షార్ట్ ఫిల్మ్ సీడీ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యాలెట్ షార్ట్ ఫిల్మ్ సీడీని బుధవారం రాత్రి ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 508.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.



శ్రీరాముడి పట్టాభిషేకం

నాదెండ్ల: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గణపవరంలో గురువారం శ్రీరాముని పట్టాభిషేకం కనుల పండుగలా నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు కిలారి రోశయ్య నామినేషన్



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కృష్ణనగర్‌లోని ఆయన నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారు. నామినేషన్ దాఖలు అనంతరం కలెక్టర్ కార్యాలయం నుంచి పాదయాత్రగా స్వామి థియేటర్ వద్దకు చేరుకుని అనంతరం జరిగే సభలో ప్రసంగిస్తారు.

గుంటూరు వచ్చిన వ్యయ పరిశీలకులు



గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వ్యయ పరిశీలకులు మిణల్ కుమార్‌దాస్, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రాధానాథ్ పురోహిత్, ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు యెర్నె వినోద్‌కుమార్ చంద్రభాన్‌లు గురువారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి వచ్చారు. వీరిని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,500, గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.5,500 వరకు పలికింది.

రాముడు రాజైన వేళ

- ఇనకుల తిలకుడి రథోత్సవం
- వేలాదిగా హాజరైన భక్తజనంతో పోటెత్తిన యనమదల
- రథం లాగేందుకు పోటీబడ్డ యువత
- వేడుకగా శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం



పోటెత్తిన భక్తజన సందోహం నడుమ కనుల పండువగా జరుగుతున్న రథోత్సవం

యనమదల (ప్రత్తిపాడు): నింగీ, నేల మురిసేలా అత్యంత వైభవోపేతంగా జరిగిన అయోధ్యాధీశుని రథోత్సవంతో పల్లె పులకించిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల పూజల, జయజయధ్వానాల మధ్య గ్రామస్తులు, భక్తులు చేయిచేయి కలిపి జై శ్రీరామ్.. జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ సీతారాములు కొలువుదీరిన రథంను ముందుకు లాగారు. 201వ బ్రహ్మోత్సవాలలో భాగంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల శ్రీ సీతారామస్వామి దేవాలయంలో గురువారం 131వ దివ్య రథోత్సవం జరిగింది. స్వామి వారిని రాజోచిత అలంకారంతో భారీ రథంపై ఊరేగించారు. రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధి గాంచిన సీతారామస్వామి రథోత్సవ వైభవాన్ని వీక్షించేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులతోపాటు మహిళలు కూడా అత్యధిక సంఖ్యలో తరలి రావడంతో యనయదల భక్త జనసంద్రమైంది. యువత రథం లాగేందుకు పోటీపడ్డారు. ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగారు.



పట్టాభిషిక్తుడైన రాములవారు

జగదానందకరం.. జగదభిరాముని పట్టాభిషేకం

తొలుత ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం నిత్య ఔపాసన, బలిహరణ జరిగాయి. మధ్యాహ్నం యనమదల సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చలువ పందిరి కింద కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా జరిగిన జగదభిరాముడు, నీలమేఘశ్యాముని పట్టాభిషేక వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు, ట్రస్టీలు, గ్రామస్తులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

తిరునాళ్ల సందడి

సీతారాముల కల్యాణ మహోత్సవం తదుపరి రోజున యనమదలలో జరిగిన తిరునాళ్లకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

27న నగరానికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా రాక

గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువ ఓటర్లను చైతన్యపరిచేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఈనెల 27న గుంటూరు నగరానికి రానున్నట్లు 'లెట్స్ ఓట్' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సీఎస్ నాయుడు పేర్కొన్నారు. ఉదయం 7.00 గంటలకు బృందావన్‌గార్డెన్స్ నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వరకు జరిగే విద్యార్థుల, యువజన ప్రదర్శనలో పాల్గొని సందేశం ఇస్తారని తెలిపారు. గురువారం 'లెట్స్ ఓట్' సంస్థ సభ్యులు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వాకింగ్ ట్రాక్ వద్ద ప్లే కార్డులు, కరపత్రాలను పంచుతూ, చైతన్య గీతాలు ఆలపించారు. సీఎస్ నాయుడు మాట్లాడుతూ ఓటర్లు తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసే స్వేచ్ఛతోపాటు సుపరిపాలనకు, తమ అభివృద్ధికి, సంక్షేమం కోసం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలని సంస్థ ప్రజలను, యువ ఓటర్లను జాగృతం చేస్తుందని వివరించారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు బుల్లి కుమార్, జీవిత బీమా సంస్థ యూనియన్ నాయకులు సీతారమేష్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మే 10 వరకు అపార్ట్‌మెంట్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్స్ వంటి చోట్ల ప్రతిరోజూ ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ ఎం.మాలకొండయ్య, టి.బాలాజీ శ్రీనివాస్ ఉన్నారు.



ప్లకార్డులు పట్టుకుని అవగాహన కల్పిస్తున్న సీఎస్ నాయుడు తదితరులు

తొలిరోజే 23 నామినేషన్లు

- పార్లమెంట్‌కు ఐదు
- మంగళగిరిలో అత్యధికంగా 14
- తెనాలి, పొన్నూరులో నిల్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో తొలిరోజున 23 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో గుంటూరు పార్లమెంట్‌కు ఐదు నామినేషన్లు దాఖలు కాగా మంగళగిరిలో అత్యధికంగా 14 నామినేషన్లు దాఖలయ్యాయి. తెనాలి, పొన్నూరులలో బోణీ కాలేదు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన గురువారం ఉదయం రిటర్నింగ్ అధికారులు ఎక్కడికక్కడ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించడం ప్రారంభించారు. గుంటూరు పార్లమెంట్‌కు సంబంధించి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి అంబటి చలమయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా దండెం రత్నం, గాయత్రి ఆదిపూడి, అప్పిశెట్టి శ్రీకృష్ణ, షేక్ అస్లాం అక్తర్ నామినేషన్లు రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డికి అందజేశారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి 10 మంది అభ్యర్థులు 14 నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నారా లోకేష్ తరపున ఎన్ అబద్దయ్య, మైనర్‌బాబు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బోడె రామచంద్ర యాదవ్, నవతరం పార్టీ అభ్యర్థి రావు సుబ్రమణ్యం, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్‌కే జలీల్, జై భీమ్ పార్టీ అభ్యర్థి జడ శ్రావణ్‌కుమార్, తెలుగు రాజాధికార సమితి పార్టీ తరపున జంజనం కోటేశ్వరరావులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా దానబోయిన వెంకట శివాజీ, బండ్ల భిక్షమయ్య, నైనాల లావణ్య, జంజనం పద్మ నామినేషన్లు దాఖలు చేశారు. గుంటూరు పశ్చిమ నుంచి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కోటపాటి సురేష్, తూర్పు నుంచి అదే పార్టీకి చెందిన కాజా వెంకటరాఘవేంద్ర సంజీవరావు, తాడికొండ నుంచి తాళ్లూరు నాగరాజు కూడా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడులో బీసీవై నుంచి ఎస్ఎస్ స్తోత్రరాణి(మహాలక్ష్మి) నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం మంచి రోజు కావడంతో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

వ్యయ పరిశీలకుడు మిణల్ కుమార్ దాస్

గుంటూరువెస్ట్: పార్లమెంట్‌తోపాటు, ఏడు నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని గుంటూరు పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు మిణల్ కుమార్‌దాస్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆయన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు రాధానాథ్ పురోహిత్, ప్రత్తిపాడు, గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు వినోద్‌కుమార్ చంద్రబాన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ, కమాండ్ కంట్రోల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను ఎన్నికల విధులు నిర్వహించే నోడల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మిణల్ కుమార్ దాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో మద్యం, నగదు, ఉచిత వస్తువులు పంపిణీ జరగకుండా పర్యవేక్షించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ శాంతియుత ఎన్నికల ప్రక్రియను ముగించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తిచేకూరి, ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిణల్‌కుమార్ దాస్

క్లుప్తంగా

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



సత్తెనపల్లి: మండల పరిధిలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద 300 క్వింటాళ్ల బియ్యాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. బాపట్ల నుంచి గుజరాత్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. అయితే బియ్యం నలుపు రంగులో ఉండడంతో ఇవి రేషన్ బియ్యమా? కాదా? అనేది తేలాల్సి ఉంది. ఒక్కో బ్యాగులో 30 కేజీలు చొప్పున వెయ్యి బ్యాగులు లారీలో ఉన్నాయని దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులకు లేఖ రాసినట్లు సీఐ రాజేష్ కుమార్ తెలిపారు. బియ్యం విషయమై డిప్యూటీ తహసీల్దార్ అరుణను సంప్రదించగా బియ్యాన్ని శాంపిల్స్ తీసి నిర్ధారణ నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. నిర్ధారించిన తర్వాత రేషన్ బియ్యం అని తేలితే కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలి

పర్చూరు (చినగంజాం): ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి తీరుతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారని, అమిత్‌షా మాటనే ఆయన పేర్కొన్నారన్నారు. ఏపీలోను అదే విధానం అని బీజేపీ నేతలు అంటున్నారని, చంద్రబాబు కూడా రిజర్వేషన్లు రద్దుకు అంగీకరించినట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారని తెలిపారు. దీంతో ముస్లిం రిజర్వేషన్లపై రాష్ట్రంలో తీవ్రమైన చర్చ నడుస్తోందన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాగానే నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, దాన్ని రద్దు చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్రంలో ఉమ్మడి కూటమి నాయకులు దీనిపై నోరువిప్పకపోవడం దారుణమని ఖండించారు. కూటమి నాయకులు తక్షణమే స్పందించాలని మస్తాన్‌వలి కోరారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

బల్లికురవ: బాలికను మాయమాటలతో తీసుకెళ్లి లైంగిక దాడి చేసిన ఘటనపై ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ సి.బాలకృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ అవినాష్ కూలీలను ఆటోలో వ్యవసాయ పనులకు వివిధ గ్రామాలకు తీసుకువెళ్తుంటాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన బాలిక ఆటోలో పనులకు వస్తోంది. ఆమెకు మాయమాటలు చెప్పి ఈనెల 15న బయటకు తీసుకెళ్లాడు. మూడు రోజులైనా గ్రామానికి రాకపోవటంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గురువారం ఇంటికి వచ్చిన బాలిక తనపై అవినాష్ అత్యాచారం చేశాడని తల్లిదండ్రులకు వివరించటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

ఓటు ఫ్రం హోం

- 85 ప్లస్ వయో వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లకు అవకాశం
- రాష్ట్రంలో తొలిసారిగా అమలు
- నియోజకవర్గ కేంద్రంలోనే ఫెసిలిటేషన్ సెంటర్లు

వృద్ధులు, దివ్యాంగులకు ఊరట



వృద్ధురాలికి ఫాం-డీ అందజేస్తున్న సిబ్బంది

నెహ్రూనగర్: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. మే 13న పోలింగ్ జరగనుంది. వేసవి కాలం కావడంతో జిల్లాలో ఎండలు ఇప్పటికే మండిపోతున్నాయి. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో చెప్పాల్సిన పనేలేదు. ఊహించుకుంటేనే భయమేస్తోంది. ఈ పరిస్థితుల్లో అసలే ఓటింగ్ శాతం తక్కువ నమోదయ్యే పట్టణ ప్రాంతాల్లో ఎంతమంది పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వెళతారో తెలియదు. వయస్సు, ఆరోగ్యం ఉన్న వారే తటపటాయిస్తుంటే ఇక వృద్ధులు, దివ్యాంగుల గురించి చెప్పే పని ఉండదు. ఓటింగ్‌లో పాల్గొనాలని వీరిలో ఉత్సాహం ఉన్నప్పటికీ వయస్సు, వైకల్యం ప్రతిబంధకంగా ఉంటోంది. వీరిని పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్లి ఓటు వేయించడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే వీరు బాధపడాల్సిన పని లేకుండా భారత ఎన్నికల సంఘం ఈ దఫా రాష్ట్రంలో కొత్తగా ఓట్ ఫ్రం హోమ్ పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇందువల్ల ఓటింగ్ శాతం పెరగనుందని అధికారులు భావిస్తున్నారు.

కోవిడ్ ప్యాండమిక్ నేపథ్యంలో 2020లో బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసే పద్ధతిని తీసుకు రావాల్సి వచ్చింది. ఆ తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ కండక్ట్ ఆఫ్ ఎలెక్షన్ రూల్స్ – 1961కి. సవరణలు తీసుకొచ్చింది. ఓట్ ఫ్రం హోమ్ కార్యక్రమం కింద 85 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులకు, 40 శాతంపై బడి వైకల్యం ఉన్న పీడబ్ల్యూడీ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు మంజూరు చేయనున్నారు. వైకల్యం ఉన్న వారు సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలి. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడానికి ముందే అర్హులకు ఫాం-డీ ఇళ్ల వద్దకే తీసుకొచ్చి అందజేస్తారు. నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లో వాటిని భర్తీ చేసి బీఎల్ఓలకు సమర్పించాలి. బీఎల్ఓలు వాటిని తీసుకెళ్లి సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తారు. పోలింగ్ కన్నా ముందే హోమ్ ఓటింగ్ ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి తేదీని నిర్ణయిస్తారు. అధికారులు పోస్టల్ బ్యాలెట్లను ఇళ్ల వద్దకే తెచ్చి అందజేస్తారు. ఐదుగురు పోలింగ్ సిబ్బంది, వీడియోగ్రాఫర్, పోలీసు రక్షణతో బ్యాలెట్ బాక్సు, కంపార్ట్‌మెంట్ సహా ఇంటి వద్దకు తీసుకొస్తారు. వృద్ధులు, వికలాంగులు పోస్టల్ బ్యాలెట్లలో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు నమోదు చేసి దాన్ని కవరులో ఉంచి బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేస్తారు.



గుంటూరు జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 17,72,022 మంది ఉన్నారు. వీరిలో పీడబ్ల్యూడీ ఓటర్లు సుమారు 14వేల దాకా ఉన్నారు. 85 ఏళ్లు, అంత కన్నా ఎక్కువ వయస్సున్న ఓటర్లు 31వేలు దాకా ఉన్నారు. వీరిలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాల్సి ఉంటుంది.

వృద్ధులు, వికలాంగుల్లో కొంతమంది తాము నేరుగా పోలింగ్ కేంద్రాల వద్దకే వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటామనే వారు కూడా ఉండ వచ్చు. అది వారి నిర్ణయానికే వదిలేస్తారు. సమగ్ర మైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశాన్ని కల్పించడంలో భాగంగా భారత ఎన్నికల సంఘం ఓట్ ఫ్రం హోం కార్యక్ర మాన్ని చేపడుతోంది.

నియోజకవర్గ కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు



ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ పర్సనల్స్ సుమారు 20 వేల మంది ఉండవచ్చని తెలుస్తోంది. ఇది ఇంకా ఆర్వోల నుంచి రావాల్సింది. గతంలో నిర్వహించిన తేదీన అందరూ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లకు వచ్చి పోస్టల్ బ్యాలెట్లు తీసుకొని తమ ఓటు వినియోగించుకునేవారు. ఇందువల్ల సమయం, డబ్బు వృథా అవుతుంది. జిల్లాలో ఈ ఏడాది కొత్తగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లోనే పోలింగ్ సిబ్బందికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీరు కాకుండా ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర అత్యవసర విధులు నిర్వర్తించే శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అలాగే జైళ్లలో ఉండే రిమాండ్ ఖైదీలకు పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తారు.

అందరి సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- యాదవ వర్గీయులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరం సమష్టిగా కృషి చేసి, ప్రత్తిపాడు గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా అని నిరూపిద్దామని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం వికాస్ నగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి యాదవ సోదరుల ఆత్మీయ సమావేశంలో మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల చిన్నరాజనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్, అంగిరేకుల ఆదిశేషులతో కలిసి బలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులంతా తమ సోదరుడిగా తనను భావించి విజయానికి కృషి చేయాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. చంద్రబాబు అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని గుర్తుచేశారు. చంద్రబాబును నమ్మే పరిస్థితిలో వారు లేరన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులు

- భవన నిర్మాణ అనుమతులకు రూ.30వేలు లంచం డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు
- మరో ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్‌పై కూడా కేసు నమోదు



ఏసీబీకి చిక్కిన చంద్రశేఖరరావు(ఎడమ), పక్కన ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్ ఇమ్రాన్‌ఖాన్

తెనాలి రూరల్: ఏసీబీ వలకు ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులు, మరో ప్రైవేట్ బిల్డింగ్ ప్లానర్ చిక్కారు. ఓ భవన నిర్మాణానికి అనుమతులిచ్చేందుకు రూ.30 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. గుంటూరు ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర మాతే వివరాల మేరకు.. చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన ఓ వ్యక్తి జీ ప్లస్ టూ భవన నిర్మాణం కోసం తెనాలిలోని సీఆర్డీఏ జోనల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. నిర్మాణ అనుమతుల కోసం కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లీల చంద్రశేఖరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర సాయినాథ్ అతనిని రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. నగదును తెనాలిలోని ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్ ఇమ్రాన్ ఖాన్ ద్వారా పంపాలని షరతు పెట్టారు. అనుమతులకు దరఖాస్తు చేసుకున్న సదరు వ్యక్తి, సమీప బంధువు రత్నబాబుతో కలిసి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు సూచించిన విధంగానే నగదును ఇమ్రాన్‌ఖాన్‌కు గురువారం అందజేయగా అతను తీసుకెళ్లి సీఆర్డీఏ కార్యాలయంలో ఉన్న చంద్రశేఖరరావు, రాజేంద్రసాయినాథ్‌కు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరు సీఆర్డీఏ ఉద్యోగులతో పాటు ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్‌పైనా కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీలు సత్యానంద్, ప్రతాప్‌కుమార్, ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు



అమ్మవారికి విశేష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. చివరి రోజు అమ్మవారికి అన్ని రకాల పుష్పాలతో అర్చన చేశారు. దేవస్థాన యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగిసాయి. అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలతో ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. పుష్పార్చన వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తులకు పుష్పాలను పంపిణీ చేశారు. యాగశాలలో ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి, రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహించారు.

గ్రామాలు సమస్యాత్మకం కాకూడదు



సాతులూరులో నాయకులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

నాదెండ్ల: మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ బిందు మాధవ్ పర్యటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అమీన్‌సాహెబ్‌పాలెం, సాతులూరు, కనపర్రు, చందవరం, గొరిజవోలు గ్రామాల్లో స్పెషల్ బ్రాంచి సీఐ ప్రభాకర్, రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి, సిబ్బందితో కలిసి పోలింగ్ బూత్‌లు పరిశీలించారు. అమీన్ సాహెబ్‌పాలెం గ్రామంలో 2014లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఇరువురు మృతి చెందిన సంఘటన విదితమే. గతంలో సాతులూరు గ్రామంలో ఓ పోలింగ్ బూత్‌లో బాంబులు వేసిన ఘటనలు ఉన్నాయి. కనపర్రు గ్రామంలో బ్యాలెట్ పత్రాలు గల్లంతు, అదే గ్రామంలో నకిలీ పీవో, ఏపీవోలు పట్టుబడిన సంఘటనలున్నాయి. గొరిజవోలు, చందవరం గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఈ గ్రామాల్లో పర్యటించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఈ గ్రామాల్లో స్పెషల్ బలగాలను మోహరించనున్నట్లు చెప్పారు. అన్ని పార్టీల శ్రేణులు ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు ముదిరాజులు కృషి చేయాలి

ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్



మాట్లాడుతున్న నారాయణ ముదిరాజ్

పిడుగురాళ్ల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపుకు ముదిరాజులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో గురువారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించింది ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముదిరాజులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ముదిరాజుల సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించి విడుదల రజినికి మంత్రి పదవి ఇవ్వడంతోపాటు, బీసీ మెంబర్‌గా పదవి ఇచ్చారన్నారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లను అత్యధిక మెజారీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ముదిరాజుల సోదరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మైనార్టీల సంక్షేమం

- కలిసికట్టుగా పనిచేసి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా, వేదికపై కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కలిసికట్టుగా పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మైనారిటీలంతా సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం వై.జంక్షన్ సమీపంలోని ఒక హోటల్‌లో జరిగిన మైనారిటీ విభాగం ఆత్మీయ సమావేశంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, మైనారిటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ జిలానీ, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. దాని వల్ల నేడు మైనారిటీ వర్గాలకు చెందిన ఎందరో యువత చక్కగా చదువుకుని, ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అదే విధంగా ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలు అందించారన్నారు. చంద్రబాబు, బీజేపీ, జనసేనలు మైనారిటీల రిజర్వేషన్లు తీసేందుకు కుట్రలు పన్నుతున్నారని అందుకే మైనారిటీలంతా ఐకమత్యంగా ఉండి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా బలసాని కిరణ్‌కుమార్‌ను, గుంటూరు ఎంపీగా కిలారి వెంకటరోశయ్యను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం నాయకులు, కార్యకర్తలు అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరం..అతిసారం

- వేసవిలో కేసులు నమోదు అధికం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



గుంటూరు మెడికల్: వేసవిలో వచ్చే వ్యాధుల్లో అతిసార వ్యాధి (డయేరియా) ముఖ్యమైంది. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం చేయించని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ప్రతి ఏడాది వేసవిలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అతిసార వ్యాధి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఈ వ్యాధిని ఏ మాత్రం అలక్ష్యం చేసినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వ్యాధి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, వ్యాధి బాధితులు పాటించాలని జాగ్రత్తలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రబలడానికి కారణాలివే

విరోచనాలు నీళ్ల నీళ్లగా, పలచగా అవుతుంటే డయేరియా (అతిసారవ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటిరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరోచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగటం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలాకా ఆ ఆహారం తినటం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు...

జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉడి వాంతులు, విరోచనాలు అవుతాయి. విరోచనాలు నీళ్లు, నీళ్లగా పలుచగా కావటం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీ హైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవటం లేదా ఒక్కోసారి అసలు నాడీ తెలియకపోవటం జరుగుతుంది. నీరసం, నోరు, నాలుక, పిడచకట్టుకుపోవటం, శరీరం ఎండిపోవటం, ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవటం లేదా చాలా తక్కువగా రావటం, ముదురు పసుపు రంగులో మూత్రం రావటం జరుగుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా డీ హైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

కాచి చల్లార్చిన నీరు తాగాలి



ద్రవరూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీగంజి, పలచగా తయారు చేసిన సగ్గుబియ్యం, రాగి జావ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. మలమూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమం. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవటం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్య నిపుణుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి



డయేరియా వల్ల పెద్ద వారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలుపుకుని తాగాలి. విరోచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. తల్లిదండ్రులు పిల్లలకు డయేరియా తగ్గే వరకు వారికి వైద్యుల సలహా ప్రకారం మందులు, ఆహారం అందించాలి.

– డాక్టర్ వూటుకూరి నీలిమ, పిల్లల వైద్య నిపుణురాలు, గుంటూరు.

ఉచితంగా వైద్య సేవలు

వేసవిలో కేసులు నమోదయ్యే దృష్ట్యా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. మందులు, సెలైన్లు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేసి ముందస్తుగా గుర్తించి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అతిసార వ్యాధి బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం.



–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, గుంటూరు

బీ-ఫాం ఏదీ నాయకా?

- తొందరపడి ముందే కదిలిన అభ్యర్థి
- ఆర్వో ఆఫీసుకు వచ్చి, తిరుగు పయనం
- కాంగ్రెస్ అభ్యర్థి కంగారుపై కార్యకర్తలు గుర్రు



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వింతలు, విశేషాలు చోటు చేసుకోవడం సహజమే. అదే కోవలో నియోజకవర్గంలో ఓ వింత గురువారం చోటు చేసుకుంది. పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థిగా బలుసుపాడుకి చెందిన పమిడి నాగేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ నియమించింది. ఈ క్రమంలో గురువారం నామినేషన్ల పర్వానికి తెర లేవడంతో రాత్రి నుంచి పెద్దఎత్తున తన బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలతో కలసి 30 వాహనాల్లో సుమారు 300 మందితో నామినేషన్ వేసేందుకు పెదకూరపాడు వచ్చారు. అయితే ఇన్ని వాహనాలకు అనుమతి లేదని అధికారులు పెదకూరపాడులోని అంబేడ్కర్ బొమ్మ వద్దనే వాహనాలు నిలిపివేశారు. ఆగ్రహించిన అభ్యర్థి నాగేశ్వరరావు అధికారులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. చివరికి అనుమతి తీసుకున్న ఐదు వాహనాల్లో తన అనుచరులు, అభిమానులతో ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి వచ్చారు. నామ పత్రాలు దాఖలు చేసే సమయంలో పార్టీ ఇచ్చే బీ-ఫాం ఏదీ అని ఆర్వో ప్రశ్నించగా దాన్ని తీసుకోలేదని, తరువాత ఇస్తానని బదులిచ్చారు. బీ-ఫాం ఉంటేనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుర్తిస్తామని ఆర్వో స్పష్టం చేయడంతో చేసేది లేక తన అనుచరులతో వెనుదిరిగారు. ఇదేంది నాయక తొందరపడి ముందే కదిలావు అంటూ కార్యకర్తలు కొద్దిసేపు నవ్వుకున్నారు.

25న 'గురుకులం' ప్రవేశ పరీక్ష

తాడికొండ: ఏపీ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో అన్ని సీట్లలో (ప్రతి పాఠశాలలో 80 మంది చొప్పున) 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఏపీఆర్ స్కూల్ ప్రిన్సిపల్ పి.జోగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి 93910 05515, 93910 05813, 93910 05182 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.